వేగవంతంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు



గెడ్డలుప్పి జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.క్రిష్ణమహేష్‌రెడ్డి అన్నారు. గెడ్డలుప్పి జగనన్న లేవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పథకాల ద్వారా అర్హులైన వారందరికీ సొంత ఇంటి కల నెరవేర్చడానికి స్థలం, ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులతో ఇళ్ల నిర్మాణాలు విషయమై చర్చించారు. అనంతరం తామరఖండి సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగులు హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు తిరుపతిరావు, ఎంపీటీసీ సత్యనారాయణ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా శనివారం జరిగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అజెండాలో అంశాలను ఆమోదించారు. ఈ క్రమంలో పెద్దబజార్లో శిథిలావస్థకు చేరుకున్న భవనాల తొలగింపు చేపట్టకపోవడం, షాపులు కొందరు వ్యక్తుల ఆధీనంలో ఉండడం తద్వారా మున్సిపాలిటి ఆదాయానికి గండిపడుతుందని తదితర అంశాలపై సభ్యులు అధికారులను నిలదీశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ, ఈ విషయాల్లో ఏమైనా న్యాయపరమైన అంశాలను పరిశీలించి వచ్చే సర్వసభ్య సమావేశానికి సభ్యులు ఆమోదం కొరకు తీర్మానం ప్రవేశపెడతామని అన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగకు జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం కనకదుర్గ అన్నారు. ఆర్టీసీ డీపో వద్ద విలేకరులతో శనివారం మాట్లాడుతూ సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా జనవరి 10, 11, 12 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన అవసరం

పార్వతీపురం టౌన్: రహదారి భద్రతా నియమావళిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్‌ఐలు పాపారావు, సూర్యారావు అన్నారు. పట్టణంలోని కొత్తవలస కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువ పత్రాలు వెంట ఉంచాలన్నారు.



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐలు

మిల్లర్ల దోపిడీ అరికట్టండి

బలిజిపేట: రైతుల నుంచి అదనంగా క్వింటాకు ఐదు కిలోల వంతున ధాన్యాన్ని దోచుకుంటున్న మిల్లర్ల దోపిడీని అధికారులు అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. మిల్లర్లు ధాన్యం విక్రయించే ప్రతీ రైతు నుంచి ఐదు కిలోల ధాన్యం ఇస్తేనే మిల్లుల వద్ద దింపుతామని, లేకుంటే లేదని చెబుతున్నారని తెలిపారు. దీనిపై రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు సింహాద్రి, సాంబమూర్తి, సింహాద్రినాయుడు, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే



బుదురవాడ గ్రామంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అర్హతే ప్రామాణికంగా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని బొడ్డవలస, టోంకి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా ఆత్మీయ స్వాగతాన్ని పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా.. అంటూ ఆరా తీశారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణి కంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయానికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ ఛైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాథరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థినులు

సాలూరు: అనంతపురం జిల్లా కదిరిలో డిసెంబరు 28, 29, 30 తేదీలలో జరిగిన అండర్ – 14 బాలురు, బాలికల హ్యాండ్‌బాల్ విభాగం స్టేట్ మీట్‌లో మండలంలోని పురోహితునివలస మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పీడీ రవి తెలిపారు. పోటీల్లో విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన విద్యార్థినులు రన్నర్స్‌గా రెండవ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రసన్న, కెజియ, రుచితలకు ప్రిన్సిపాల్ అంజలిదేవి, పీడీ అభినందనలు తెలిపారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మావుడి రంగునాయుడు

మక్కువ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను శనివారం నిర్వహించారు. మండలం నుంచి సుమారు 35 జట్లు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విజేతలకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మావుడి రంగునాయుడు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఎస్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం

పార్వతీపురం టౌన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగింది. 2022 – 23 సంవత్సరం రివైజ్డ్ బడ్జెట్, 2023 – 24 అంచనా బడ్జెట్‌ను సమావేశంలో చర్చించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో నిర్వహించాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అధికారుల పనితీరుతోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ ఛైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, కమిషనర్ రామప్పనాయుడు, కౌన్సిల్ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క్యా. 10గ్రా.)	54,930–00
బంగారం(22క్యా. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: మండలంలోని నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రూరల్ సీడీపీఓ సుగుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బూర్జ, మెట్టవలసలో అంగన్‌వాడీ హెల్పర్‌లు, పోయిమల, వంగరగుడ్డివలసలో మినీ అంగన్‌వాడీ వర్కర్‌లకు రోస్టర్ ప్రకారం ఎస్టీలకు కేటాయించినట్టు పేర్కొన్నారు. స్థానిక వివాహితైన అర్హులైన మహిళలు ఈ నెల 6 లోగా దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

సకాలంలో రేషన్ సరుకుల పంపిణీ : డీఆర్‌ఓ



రేషన్ వినియోదారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటరావు

సీతానగరం: వినియోగదారులకు రేషన్ డిపోల ద్వారా ప్రతి నెలా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు నిర్దేశించిన గడువు లోగా డీలర్లు పంపిణీ చేయాలని డీఆర్‌ఓ జె.వెంకటరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, పెదబోగిలి రేషన్ డిపోలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ డిపోల్లో ఉన్న సరుకు నిల్వలు(స్టాక్ బోర్డులు) పంపిణీ చేసిన సరుకుల వివరాలను సేకరించారు. అనంతరం తూనిక మిషన్లను పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ డిపోలను ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. సీఎస్‌డీటీ రమేష్‌బాబు, రేషన్ వినియోగదారులు,డీలర్లు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చినబోగిలి వద్ద శనివారం ఓ వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. చినబోగిలి గ్రామానికి చెందిన కునుకు సింహాచలం(45) చినబోగిలి కాలనీ నుంచి చినబోగిలి గ్రామానికి ట్రాక్ దాటుకుని వస్తున్న సమయంలో ట్రైన్ వచ్చి ఢీకొంది. దీంతో సింహాచలం దుర్మరణం చెందాడు. స్థానికులు రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఫైర్ క్యాన్లు పంపిణీ

బలిజిపేట: పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఫైర్ క్యాన్లను ఎంఈఓ శ్రీనివాసరావు సీఆర్‌పీలకు శనివారం అందించారు. మండలంలో 30పాఠశాలలకు ఈ పరికరాలు వచ్చాయని వాటిని పాఠశాలల వారీగా సీఆర్‌పీల ద్వారా పంపిణీ చేయించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలల వద్ద అనుకోని పరిస్థితులలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని నియంత్రించడానికి ఈ పరికరాలు వినియోగించాలని సూచించారు. వీటితో పాఠశాలలకు మరింత భద్రత సమూరుతుందన్నారు. మధు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

సాలూరు: మండలంలో పట్టుచెన్నేరు ఘాట్‌రోడ్డు వద్ద ఆటో ఢీకొని మహిళకు శనివారం గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... మారికచింతలవలస నుంచి వస్తున్న డొంకలవెలగవలసకు చెందిన జూలి పట్టుచెన్నేరు ఘాట్‌రోడ్డు వద్ద ఓ ప్రాంతంలో ఆగారు. రోడ్డు దాటుతున్న జూలిని, ఘాట్ రోడ్డు నుంచి కిందకు వస్తున్న ఆటో ఢీకొట్టి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో జూలి, ఆటో డ్రైవర్ తిరుపతిరావుకు గాయాలయ్యాయి.దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయకునికి సన్మానం

బలిజిపేట: పెదపెంకి ప్రాథమిక పాఠశాలలో కళాకారుడు ఈశ్వరరావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా శనివారం సన్మానించారు. తుమరాడ గ్రామానికి చెందిన గాయకుడు ఈశ్వరరావు పెదపెంకి - 1వ నంబరు పాఠశాలలో పాటలు పాడి విద్యార్థులను, ఉపాధ్యాయులను అరరించారు. వృద్ధ గాయకుడిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువ కప్పి నగదు బహుమతి అందించి సన్మానించారు. హెచ్‌ఎం అప్పలసామి, సహ ఉపాధ్యాయులు బి.శంకరరావు, దమయంతి, విద్యార్థులు పాల్గొన్నారు.